కథాపేటిక

# అందరూ... మన్నించేవారే!

సి.వి.కొండయ్య

''పోస్ట్..!'' కాలింగ్ బెల్‌తోపాటు ఒక అబ్బాయి కేకలాంటి పిలుపు. కళ్ళు తెరచి గోడ గడియారం వైపు చూశాను. ఉదయం తొమ్మిది గంటలు. పదిగంటలు దాటకముందే పోస్టా? బద్ధకంగా వున్నా లేవక తప్పలేదు. ఇంట్లో అందరూ షిర్డీకెళ్ళారు. ఖచ్చితంగా స్పీడ్-పోస్ట్, లేదా కొరియర్ సర్వీసై వుంటుంది. అంత అర్జంటుగా ఎవరు వ్రాసి వుంటారనుకుంటూ లేచి తలుపులు తీశాను.

''ఇక్కడ సంతకం పెట్టండి!'' అంటూ ఓ పల్చటి ప్రింటెడ్ ఫామ్ మీద సంతకం పెట్టించుకుని, బాడుగ సైకిల్ మీద వచ్చినవాడు, దానిమీదే రివ్వున వెళ్ళిపోయాడు. కవరు మీద నా చిరునామా వ్రాసిన దస్తూరీ చిరపరిచితంగా వున్నా, వెంటనే గుర్తుకు రాలేదు. కొంపదీసి పల్లవి ఉత్తరం కాదు కదా?! పల్లవి పెళ్ళితో అన్ని సంబంధాలూ తెగిపోయాయి. మళ్ళీ ఇప్పుడు ఎందుకు ఉత్తరం వ్రాసినట్టు?

అది పల్లవి వ్రాసిన ఉత్తరమే! సంబోధన ఏమీలేదు. ఊరూ, పేరూ, తారీఖు, సమయం, పరిసరాలు ఏమీ లేవు. పద్ధతంతా మారిపోయింది. పెళ్ళయితే అంత మార్పా!?.. ఉత్తరం పలకరింపుతో మొదలైంది-

''ఏవండీ- బావున్నారా.. నన్ను మరచిపోయారా?

రెండు సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత మళ్ళీ నా వుత్తరం మీకు! వింతగా వుందికదూ? ఒక్కరోజు మీ ఉత్తరం రావటం ఆలస్యమైతే పిచ్చి పట్టినట్లుండేది. ఏమీ తోచేదికాదు. అలాంటిదాన్ని మీకు ఉత్తరం వ్రాయకుండా, మీనుండి ఉత్తరం లేకుండా- ఒకరోజా, రెండు రోజులా- రెండు సంవత్సరాలు- ఎలా వుండగలిగానా- అని నాకే ఆశ్చర్యం వేస్తోంది.

ఈమధ్యకాలంలో మీకు వింత కలిగించేది, మరొకింత బాధ కలిగించే ఓ సంఘటన జరిగిపోయిందండీ! అది నా పెళ్ళి...!

''మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్!'' అని ఏ మహానుభావుడన్నాడోగానీ, అది ఎటర్నల్! అంటే శాశ్వత సత్యంగా అగుపిస్తోంది!

నన్ను ఆరాధిస్తూ, నాకోసమే జీవితాంతమూ ఎదురుచూస్తూ వుంటానంటూ, ఒక అబ్బాయి (పేరు మీకు తెలుసు) పిచ్చిగా వుత్తరాలు రాస్తూ, నాకోసం లైబ్రరీలో పడిగాపులు కాచేవాడు- గుర్తుందా? ఆ అబ్బాయితో జరుగలేదు నా వివాహం.

ఒక బ్యాంకు ఉద్యోగితో జరిగిపోయింది. ఏడుకొండలవాడిముందు అర్జంటుగా జరిగిపోయింది.

నా పెళ్ళికి మీరు వస్తారని ఎంత ఎదురుచూశానో! ప్చ్!.. మీతోనో, ఆ పిచ్చి కుర్రాడితోనో కావలసిన నా పెళ్ళి- ఊరూ, పేరూ, పరిచయం కూడాలేని ఓ వ్యక్తితో అనుకోకుండా జరిగిపోయింది.

పెళ్ళి తల్లిదండ్రుల ఇష్టప్రకారమే జరిగింది.

పాపం! వాళ్ళిద్దరిప్పుడు నిశ్చింతగా నిదురబోతూ వుంటారు. తమ గుండెలమీది కుంపటి దింపుకున్నామని అనుకుంటారేగానీ, ఆ కుంపటి తమ కూతురు గుండెల్లో నూరేళ్ళ వరకూ మండుతూ వుంటుందని అనుకోరు..

మీరు కూడా నన్ను మరచిపోయి వుంటారు-

ఈ పిచ్చిదానితో నాకెందుకని రొటీన్‌లో పడిపోయి వుంటారు. ఎటొచ్చీ నాకే నిద్దుర కరువైపోయింది...

పెళ్ళి శుభలేఖ మా చిన్నాన్నగారితో పంపించాను. మీరు క్యాంపు వెళ్ళారట! మీ శ్రీమతిగారికి యిచ్చి వచ్చారన్నారు. ఆవిడ తప్పకుండా మీకు ఇచ్చేవుంటుంది. పాపం! మీ ఆవిడ- నా పెళ్ళి మీతో కాకుండా మరెవరితోనైనా వెంటనే జరిగిపోవాలని ఎన్ని దేవుళ్ళకి మ్రొక్కుకుందో!

ఆవిడ ఆశించినట్టే జరిగింది!

మా పెళ్ళికి రాలేకపోయినా, కనీసం కాళ్ళ పారాణి పాతపడకముందే వచ్చి (మీరిద్దరూ రావాలి), నన్ను ఆశీర్వదించి వెళ్ళండీ! నా జీవితంలో కనీసం ఆ తృప్తయినా మూలధనంగా దాచుకుంటాను.

పెళ్ళి బాగానే జరిగింది.

నిన్నటివరకూ ఎటువంటి పరిచయమూ, చివరకు ఒక చూపయినా పాతపడని వ్యక్తితో వివాహం జరిగి తక్షణమే అన్నీ సమర్పించుకునే స్థితి- సెంటిమెంట్స్‌తో బ్రతికే నాలాంటి అభాగ్యురాలికి ఏమనిపించిందో ఎలా వ్రాయను? మీరు రచయితలు కదా? వూహించుకోండి!

ప్రతి చిన్న విషయమూ డీటెల్డ్‌గా మీకు ఒకప్పుడు రాసేదాన్ని. భారతీయ నీతిశాస్త్రం ఇప్పుడా అనుమతిని ఇవ్వడంలేదు. క్షమిస్తారు కదూ?... చాలా చాలా రాయాలనుంది. కానీ నిద్ర ముంచుకొస్తోంది. సారీ సర్!

మీ పలకరింపు కోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తుంటాను. మరి శెలవా?..

• • •

నా పలకరింపు కోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూట్టమా? ఎందుకూ? పెళ్ళయిన తర్వాత నా పలవరింపు తనకు ఎందుకు అవసరమైందో ఎంత ఆలోచించినా అర్ధంకాలేదు. రాయకుండా వుండలేక ఏవో ముక్తసరి మాటల్తో ఉత్తరం ముగించి పంపించాను. వెంటనే జవాబివ్వటం తన అలవాటు.. అది మారలేదు.

రెండో వుత్తరం వెంటనే అందింది.

''చిరపరిచితమైన మీ పలుకరింపును, సొంపుగా తీర్చిదిద్దిన అక్షరాల్లో ముక్తసరి ముగింపువల్ల కొంత అసంతృప్తి కలిగినా, ఎంత ఆనందం కలిగిందో! ఇప్పట్లో రాలేనని వ్రాశారు. అంటే మరెప్పుడైనా వస్తామన్న భావన వున్నట్లే కదా? కారణాలు, అవాంతరాలు, ఈ మనిషి జీవితానికి మామూలుగా వుండేవే కదండీ! వీలు చూసుకుని వచ్చి ఈ పిచ్చిపిల్లని ఆశీర్వదించి వెళ్ళండీ! ప్లీజ్! ఆ తర్వాత మిమ్మల్ని ఏమీ కోరను. బైది బై- మీట్ మై హజ్‌బెండ్!

పేరు భానుప్రకాష్! ఎం.ఎ (బీ కామ్), బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌లో ఫీల్డ్ ఆఫీసరుగా పనిచేస్తున్నారు. మామ రిటైర్డ్ టీచరు. మధ్యతరగతి కుటుంబం. పరపతిపరులు. పోతే మా అత్తగారు! పాతకాలం మనిషే అయినా అడుగు తీసి, అడుగు పెట్టేలోపల ఎన్ని సెకెండ్లు పట్టాయో, ఎటు వైపు అది సాగుతోందో పసికట్టగల విచిత్రమైన కంప్యూటర్! ఇంకా చాలా జనాభా వున్నారండీ! మీకు విసుగొస్తుంది.

కొత్త జీవితం, కొత్త సంసారం ఎలా వుందని రాసారు.

ఏముందండీ..!

అది మీరూ ఎప్పుడో రుచి చూశారు కదా! కొత్తగా నేను చెప్పేదేముంటుంది? మీ రచయిత బుద్ధి పోనిచ్చుకున్నారు కాదు.

భర్తతో మేజర్ అడ్జస్ట్‌మెంట్! మిగతావాటితో మైనర్ సర్దుబాట్లు. అంతా కొత్తకదండీ! నాలోని వ్యక్తితోనే పడటం లేదు.

మనసులోని మనిషితో సంసారమేంటి?

ఆత్మవంచన కాదా? ఇలా ఎన్నో ప్రశ్నలతో సణుగుతోంది. నేను పట్టించుకోవటంలేదు. 'దయచేసి నా గమ్యానికి అడ్డురావద్దు' అని ప్రాధేయపడితే- జాలిపడి 'సరేలే' అంది.




అందరి జీవితమూ అంతో-యింతో ఆత్మవంచనతో కూడుకున్నవే కదండీ! మీ భార్య దగ్గర మీరు నటించటం లేదా? నేనూ అంతే! చాలామందీ అంతే! వనితలకైతే అది వుగ్గుపాలతో పెట్టిన విద్య.

దాన్నే నిజమనుకుని మురిసిపోతుంటారు మగవారు! నా నటనలో కూడా నిజాయితీ వుంది. ఒక వ్యక్తికి భార్యగా నా హద్దులు, బాధ్యతలు నాకు తెలుసు. వాటిని నిజాయితీగా అమలుపరిచే మనోస్థైర్యం నాకుంది. రొటీన్‌కు అలవాటు పడుతున్నాను.. మీ ఉత్తరం కోసం...

• • •

ఉత్తరం అందిన మరుక్షణంలోనే మీ ప్రశ్నల- వర్షంలో తడిసిపోయానండీ!

కొన్ని గుచ్చుకున్నాయి- మనసుకి.

మనసు గురించి నేనంతగా ఇప్పుడు పట్టించుకోవటంలేదు. కాబట్టి ఫర్వాలేదు. కానీ మీరు వ్రాసిన ఒక విషయం మాటి-మాటికీ గుర్తుకొస్తోంది.

ప్రేమ- స్నేహం గురించి వ్రాశారు-

నా దృష్టిలో రెండూ ఒకటి కావండీ!

స్నేహం! ఒక భావన!

ప్రేమ! అదొక పిచ్చి! అదొక తీవ్రమైన అనుభూతి. అదెప్పుడూ కోరుకున్న వ్యక్తి దగ్గరలో వుండాలని కోరుకుంటుంది. అలాంటి భావన లేని స్నేహం వీలుకాదంటారా? మగవాడిలో ముఖ్యంగా పిచ్చికోరిక వుంటుంది. అది కేవలం శరీరానికే పరిమితమై వుంటుంది. ప్రేమే స్త్రీ సర్వస్వమని మగవాడు అర్థం చేసుకోడు. స్త్రీ మనసును, దేహాన్ని కదిలించి, కరిగించి, మరిగించి- తుఫాను కెరటాల మధ్య వూగే నావలా ఆమె వ్యక్తిత్వమంతా కుదుపులతో నిండిపోతుంది.

పరిస్థితులకు ఎదురుతిరిగితే సబలలంటారు. లేదా అబలలంటారు. చివరకు స్త్రీ- స్త్రీగానే మిగులుతుంది. ఆమెను సానుభూతితో అర్థం చేసుకుని ముందుకు నడిపించే భర్తగానీ, స్నేహితుడుగానీ, దొరకటం దుర్లభం. స్త్రీని తనకు నీడగా బ్రతకమంటాడు పురుషుడు. అలా వీలుకాని పరిస్థితి ఏర్పడితే- అప్పటినుండే ప్రారంభమౌతుంది- ఓ సుదీర్ఘ ఏకాంత నీరవ కురుక్షేత్ర సంగ్రామం! రెండురకాల ద్వంద్వ మానసిక తత్వంతో బ్రతుకును నెట్టుకురావలసి వస్తోంది.

ప్రేమగా, స్నేహంగా మొదట పొందిన నా మొదటి అనుభూతిని కాలం కాటు వేసింది. నేనెంత బాధతో మెలికలు తిరిగిపోయానో, భగవంతుడికే తెలుసు. ధైర్యం, అనుభవం లేక తెలిసి- తెలిసి తెగిపోయిన గాలిపటం కోసం పరుగెత్తి- పరుగెత్తి అలసిపోయాను.

జీవితంలోంచి ప్రేమను మైనస్ చేస్తే- మిగిలే వాక్యూమ్‌లో కాక్టస్ మొక్కలు పెరిగి, అవి గుండెను గుచ్చుకుంటూ వుంటే ఎలా వుంటుంది? మీరు పురుషులు. మా బాధను అర్థం చేసుకోలేరు. సమాజాన్ని ఎదిరించి విడిపోయి బ్రతకటం- అనుకున్నంత సులభం కాదు. చూపున్నవాడిని గ్రుడ్డివాడనలేం కదా?

వివాహితులని తెలిసి కూడా మీ తీయని పిలుపు కోసం ఆరాటపడ్డాను. నా అనుభూతికి, ఆలోచనలకి అర్థం పట్టిన మీ స్నేహంలో నా జీవితం తరించిపోయిందనుకున్నాను. బదులుగా నేను పొందిన మానసిక వేదన, ఆంతర్య పోరాటం, ద్వంద్వ ఆందోళన, గత స్మృతుల బాధ, రోగగ్రస్త తనువు- మనసుతో ముక్తిపోరాటం- వీటన్నిటి పర్యవసానమే నా పెళ్ళి! అంతకంటే ఏం వ్రాయను చెప్పండి?

ఒకే అభిరుచి, నిజాయితీగల పురుషుడు స్త్రీకి లభించడం చాలా కష్టమండీ! విదేశాల్లో పరిస్థితి వేరు. ప్రేమించటం పాపం కాదు! ప్రేమించినవారిని ఆడిపోసుకునేవారెవరూ అక్కడ అగుపించరు. అక్కడ స్త్రీకి ఆత్మహత్య చేసు

## ముదురు బెండకాయ



ముంబాయిలో ఈమధ్య మాధురీదీక్షిత్‌కి ఓ నిక్ నేమ్ పెట్టారు. అదేంటో తెలుసా!- 'ముదురు బెండకాయ' అని అర్థం వచ్చే పదం. మాధురికి ముప్ఫయ్ ఐదేళ్ల వయసు వచ్చేస్తోంది. అయినా తనకింకా ముప్ఫయ్యేళ్లు రాలేదని ఆవిడ చాలా సీరియస్‌గా చెపుతూ వుంటుంది. 'ముప్ఫయ్యేళ్లయితే అప్పుడే ముఖంలో ముడతలు ఎందుకొచ్చేసాయి' అని సాటి హీరోయిన్‌లు ఎగతాళిగా అడుగుతుంటారు. ఈ ప్రశ్నల పరంపరను తట్టుకోలేకాబోలు మాధురీదీక్షిత్ ఈమధ్య ఫేస్ లిఫ్టింగ్ చేయించుకున్నదని వినికిడి. తనకున్న పిచ్చి ముసలి అభిమాని ఎఫ్.ఎమ్. హుస్సేన్ సినిమా 'గజగామిని' షూటింగ్ నిమిత్తం విదేశాలకు వెళ్లినప్పుడు ఈ పని పూర్తిచేయించుకుందట... అన్నట్టు ఈమధ్య వరకూ మాధురికి 'క్లీన్' బిరుదు ఉండిందిగానీ, ఇప్పుడు ఆ బిరుదు పోయింది. ఆమె సెక్రెటరీ 'రిక్కూ'తో ఉన్న అనుబంధం బయటకొచ్చాక... వయసయిపోతుంటే తను మాత్రం ఎంతకాలం 'క్లీన్'గా ఉండగలదు- అంటున్నారు సినిమా జనం.

-జె.వి. బాబు




కోవలసిన అవసరం లేదు. మన పుణ్యభూమి మీద అలాంటి వెలుగు ఎప్పుడు ప్రసరిస్తుందోకానీ, అప్పటివరకూ ఇక్కడ యౌవ్వనం ఎక్కిళ్ళు పట్టి ఏడ్వవలసిందే.''

• • •

''వివాహాయ ప్రేమ నాశాయ'' అని రాశారేంటి?

చదవగానే వులిక్కిపడినంత పని జరిగింది. అది మీ అనుభవం కావచ్చు! కానీ నేనలా అనుకోవటంలేదండీ! కళ్యాణ-మండపం వరకూ నడవలేని ప్రేమ శాపగ్రస్తమైనదని నా భావన. ''మరి ఇప్పుడు నీవు నీ భర్తను ప్రేమిస్తున్నావా?'' అని అడక్కండి. ద్వేషించటం లేదని కచ్చితంగా చెప్పగలను. ఆయన నన్ను ఎంతో అపురూపంగా చూసుకుంటున్నారు. ఒక పురుషుడి తోడు కావాలి. వేదనా విముక్తే నా లక్ష్యం.

నిన్న మా పెద్దక్కయ్య వచ్చి గంటల తరబడి మాట్లాడింది. కొన్ని నెలల తర్వాత వచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న జీవితానికి ఆవిడ ప్రత్యక్ష సాక్షి. నన్ను- ''మారిపోతున్నావే!'' అంది. నలుగురు పిల్లల తల్లి. తన అనుభవాలు తనకున్నాయి. సాహిత్య అకాడమీలో పనిచేస్తోంది. రోజూ పూజాపునస్కారాలు చేస్తుంది. పెళ్ళయి పది సంవత్సరాలయ్యాయి. తన భర్తతో కలిసి కొన్నివేల మైళ్ళు నడిచి వుంటుంది. భర్తపట్ల ఎటువంటి అనుభూతీ, సెంటిమెంటూ లేకుండా ఆవిడ బ్రతుకుతోందంటారా?

• • •

అమ్మాయిలకు లేటుగా పెళ్ళి చేయకూడదండీ! ఇరవై, ఇరవై రెండు సంవత్సరాలకల్లా పెళ్ళయిపోయి వుండాలి. లేకపోతే కొన్ని అలవాట్లు పక్వానికొస్తాయి. పక్వానికొచ్చిన రెండు వస్తువులూ ఒకచోట ఇమడవు. పాచిపోతాయి. మీకూ అమ్మాయిలున్నారనుకుంటాను! జాగ్రత్తపడండి! పురుషుడు లేకుండా స్త్రీ జీవితానికర్థం వుండదు. మగవారి గురించి కూడా అంతేనేమో! పోతే ఎవరు ఎలాంటివారిని పొందుతారో, ఎవరిని పోగొట్టుకుంటారో- తెలియదు. ఇది ఎప్పటి సమస్యే...

స్త్రీ ప్లస్ పురుషుడు యీజ్ యీక్వల్ టు- వాట్- అన్నది నాకింకా అర్థం కావటంలేదు. తమ తమ ఉనికి కోసం పోరాటం ఇద్దరిలో ఆదినుండి కొనసాగుతూనే వుంది. నా జీవితంలో కూడా అదే ప్రారంభమైనట్టుంది. తన అహంతో, నా అహాన్ని ఆయన మేల్కొల్పాడు. కోల్డ్ వార్ జరుగుతోంది. ఎలా ముగుస్తుందో వేచి చూడాలి.

తాత్కాలిక ముగింపులు ఎప్పుడు, ఎలా వున్నా చివరి ముగింపు అందరిదీ ఒక్కటే కదండీ! అది కూడా వచ్చేస్తే యిహ ఏ బాధా, సమస్యా వుండదు. వచ్చే జన్మంటూ వుంటే- స్త్రీగా మాత్రం నన్ను పుట్టించవద్దని ఆ దేవుణ్ణి మరీ- మరీ కోరుకుంటాను.

• • •

...ఒక నెల నుండి ఆరోగ్యం సరిగా లేదండి! తల్లి కాబోతున్నాను కదా! స్త్రీ సార్థకత సంతానం కనటంలోనే వుందని చాలామంది అంటుంటారు. నాకలా అనిపించటం లేదండీ!

నా శరీరం వికృతంగా తయారైంది. ఎవరి ఎదుట పడాలన్నా అదోలా వుంది. కానీ దాన్నే చూసి యింటివారు సంతోషపడుతున్నారు. మగపిల్లవాడని ఒకరంటే, ఆడపిల్లని మరొకరు పందేలు వేసుకుంటూ వున్నారు. ఎవరు పుడతారన్నది గ్యారంటీ లేదు. మా శ్రీవారు మాత్రం వులుకూ- పలుకూ లేకుండా వున్నారు. ఆయన ఏమన్నా అంటారేమోనని ఆత్రంగా ఎదురుచూస్తాను. మొదటి నుండీ అదే సీరియస్‌నెస్ మెయింటేన్ చేస్తున్నారు. ఈ ఉత్తరం ఎక్కడనుండి రాస్తున్నానో తెలుసా? పెళ్లికి పూర్వం గుండెలో అగ్నిపర్వతం దాచుకుని, కరిగిపోయే మైనంలో, ఆనందంగా ఒకప్పుడు మీ పలకరింపు కోసం అహర్నిసలు ఎదురుచూసే గదిలో కూర్చొని రాస్తున్నాను. గతం తాలూకు జ్ఞాపకాలు అటు-ఇటూ నిశ్శబ్దంగా తారాడుతున్నాయిక్కడ! ఒకప్పుడు అవి నావి, నా సొంతమనుకునేదాన్ని, ఇప్పుడు వాటిని దూరంగా వుంచి సాక్షి సంతకంలా చూస్తూవున్నాను. పరిస్థితులు మారితే అనుబంధాలకు కూడా అర్థాలు ఎంత త్వరగా మారిపోతాయని, అనుభవంలో ఇప్పుడు చూస్తున్నాను.

చాలారోజులైంది. శ్రీవారి దగ్గరి నుండి ఉత్తరాలు లేవు. ఆయనకు నామీద మోజు తీరిపోయిందేమో! మీరు నాకున్నట్టే, ఆయనకు కూడా ఒక గర్ల్-ఫ్రెండ్ వుంది. అప్పుడప్పుడూ ఆదివారాలు ఆయనే వెళ్ళి ఆవిడను యింటికి తీసుకు వస్తుంటాడు. అప్పుడు మాత్రం చాలా హుషారుగా, చలాకీగా, సోషల్ మానర్స్, ఫార్మాలిటీలు పాటిస్తారు. ఆమె రచయిత్రి కూడానట! ఆమెకు మరో మగస్నేహితుడు కూడా వున్నాడట! ఆవిడ రచనలు ప్రింటు కావటానికి చేయూతనిస్తూ వుంటాడట! అతనికి కూడా నాలాంటి ఓ భార్య త్రిశంకు స్వర్గంలో వుందని విన్నాను. అందరి చుట్టూ మంటలు వున్నాయి. ఎవరికి వారే కాలిపోతూ కూడా, అవేవీ లేవన్నట్టు నటిస్తూ జీవిస్తున్నారు. అందరూ మంచి యాక్టర్లే.

మొదటి కాన్పు ఆడదానికి రెండో జన్మ అంటారు. ఇంకెందుకండీ బ్రతకటం? ఆనందంలేదు. రాదు. విశ్రాంతి లేదు. రాదు. కేవలం చావుకోసం బ్రతుకుతున్నట్టుగా వుంది. ఎందుకూ? ఎవరి జీవితం ఎక్కడ ప్రారంభమైనా, ఎలా ప్రారంభమైనా, అందరూ చివరి మజిలీ చేరుకోవలసిందే. నేనన్నింటిలో స్పీడు ఎక్కువంటారు మా శ్రీవారు. చివరి మజిలీ చేరుకోటానికి కూడా స్పీడే? మీరెలా వున్నారని అడిగే స్థితిలో కూడా లేనిప్పుడు. పరిస్థితులు మనిషిని ఎంతగా మారుస్తాయండీ?''

★